క్లుప్తంగా

పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాక్సినేషన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పెంపుడు జంతువులను **ప్రేమించే ప్రతి** ఒక్కరూ సకాలంలో రేబీస్ **వ్యాక్సినేషన్ వేయిం**చాలని శాసనసభ్యులు **ఆదిరెడ్డి శ్రీనివాస్** (వాసు) పిలుపునిచ్చారు. **ప్రపంచ జూనోసిస్** దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఏరియా పశు వైద్యశాలలో జిల్లా పశువైద్యశాఖ, ఆరోగ్యశాఖ, నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెంపుడు జంతువులకు, వాటి యజమానులకు రేబీస్‌వ్యాక్సినేషన్ కార్యక్రమంను ఆయన ప్రారంభించారు. ఇన్‌చార్జి జిల్లా పశువైద్యాధికారి డా.డా.మక్కెన వెంకటేశ్వర రావు, ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డా.కె.సత్యనారాయణ, పాల్గొన్నారు.

కోనేరు మురళికి పలువురి పరామర్శ



కోనేరు సుస్మంత్ వెంకట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పురందేశ్వరి దంపతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుత్ర వియోగంతో బాధపడుతున్న నగర ప్రముఖుడు కోనేరు మురళిని, ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు దంపతులు పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు. కోనేరు సుస్మంత్ వెంకట్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురుకూరి కిషోర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నిమ్మలపూడి గోవింద్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

మెడికల్ షాపుల్లో డ్రగ్స్ అధికారుల తనిఖీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఔషధ నియంత్రణాధికారులు ఆదివారం మూడు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మందుల దుకాణాల్లో సిడినాఫిల్ సెట్రేట్ (వయాగ్రా) మందులు విక్రయిస్తున్నారనే సమాచారం అందిన కారణంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు డ్రగ్స్ అధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం, బుట్టాయిగూడెంలలో వయాగ్రా దందా అధికంగా నడుస్తోంది. ఆ ప్రాంతాలకు రాజమహేంద్రవరం కేంద్రంగా మందులు సరఫరా అవుతున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో దేవీ చౌక్‌లోని అపోలో, బైపాస్‌రోడ్డులోని సంజీవనీ మెడికల్స్, గోరక్షణపేటలోని సత్య మెడికల్స్‌లో తనిఖీలు చేశారు. అయితే ఈ దుకాణాల్లో ఎటువంటి ఆధారాలు లభించలేదు. అపోలో మెడికల్స్‌లో వయాగ్రా మందులు ఉన్నప్పటికీ వాటన్నింటికీ ఆ దుకాణం నిర్వాహకులు డ్రగ్స్ అధికారులకు సంబంధిత బిల్లులు చూపించారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హరహరితేజ మాట్లాడుతూ దేవీచౌక్ అపోలో మెడికల్‌తో పాటు మరో రెండు దుకాణాల్లో సిడినాఫిల్ సెట్రేట్ (వయాగ్రా) మందులు బిల్లులు లేకుండా అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. అటువంటి ఆధారాలు కనిపించలేదన్నారు. అపోలో మెడికల్‌లో సరిగా రిజిస్టర్ మెయింటెనన్స్ చేయకపోవడం వంటివి కనిపించాయన్నారు. ఆయనతో పాటు మరో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

సంగీత సరస్వతి ముద్దుబిడ్డ మంగళంపల్లి

రాజమహేంద్రవరం సిటీ: సంగీత సరస్వతి ముద్దు బిడ్డ మంగళంపల్లి బాల మురళీకృష్ణ అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డు శ్రీనివాసనగర్‌లోని మంగళంపల్లి బాల మురళీకృష్ణ నగర పాలక సంస్థ పార్కులో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన మంగళంపల్లి బాల మురళీకృష్ణ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడారు.

సినిమాలు



శ్యామల	: తమ్ముడు
సూర్యమినీ	: 3 బీహెచ్‌కే
సూర్యప్యాలెస్	: జురాసిక్ వరల్డ్
స్వామి	: కుబేర
అనుశ్రీ	: జురాసిక్ వరల్డ్
శివజ్యోతి	: తమ్ముడు
రాజా	: తమ్ముడు
ఊర్వశి	: జురాసిక్ వరల్డ్
మేనక	: షోటైమ్
రంభ	: మార్గన్
అప్సర	: తమ్ముడు
అశోక	: కన్నప్ప
నామవరం	
వీఎస్ మహల్	: తమ్ముడు
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: తమ్ముడు
కడియం	
వెంకటసూర్య	: తమ్ముడు

వాసి వాడి తస్సాదియ్యా!

- పోలీసులను వెక్కిరించిన సైరన్లు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన టీడీపీ నేత
- నడిరోడ్డుపై స్టేజీ ఏర్పాటు చేసి బర్త్‌డే వేడుకలు



పోలీస్ సైరన్‌తో వెళుతున్న వాసిరెడ్డి బాబి కాన్వాయ్



వాసిరెడ్డి బాబి బర్త్‌డే వేడుకలకు రోడ్డుపై వేసిన స్టేజీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికార, అనధికార తేడా లేకుండా పోతోంది. ప్రజోపయోగ పనులకు తోడ్పడాల్సిన ప్రొటోకాల్ వ్యవహారాలు పక్కదారి పడుతున్నాయి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా కూటమి నాయకుల తీరు కొనసాగుతోంది. తాజాగా రాజమహేంద్రవరం సిటీకి చెందిన ఒక నాయకుడి తీరుతో ప్రజలు విస్తుపోతున్నారు. వివరాలలోకి వెళ్తే తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడైన గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రధాన అనుచరుడు వాసిరెడ్డి రాంబాబు కుమారుడు వాసిరెడ్డి బాబి పుట్టినరోజు వేడుకలు ఆదివారం రాత్రి జరిగాయి. ఈ వేడుకల నిమిత్తం సుమారు పదికి పైగా కార్లలో పోలీసు సైరన్‌లను వినియోగించారు. బాబి అనుచరులకు చెందిన కార్లకు ఈసైరన్‌లు అమర్చి సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ర్యాలీ చేశారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని బాలాజీపేటలో రోడ్డును బ్లాక్ చేసి టెంట్‌వేసి స్టేజీ ఏర్పాటు చేశారు. ఈ స్టేజీ వద్దకు బాబిని తీసుకువచ్చేందుకు ఈ సైరన్ బిగించిన కార్లను వినియోగించారు. ఈ కార్లు ప్రయాణించేందుకు జాతీయ రహదారిపై రెండుచోట్ల ట్రాఫిక్ నిబంధనలను సైతం ఉల్లంఘించారు. ఈ రెండుచోట్లా నిత్యం ట్రాఫిక్‌ను పర్యవేక్షించే సిబ్బంది సైతం లేకుండా సదరు కాన్వాయ్‌కు వెసులుబాటు కల్పించారు. అయితే సుప్రీంకోర్టు పోలీసు సైరన్‌లు వినియోగించడానికి పలు పరిమితులను విధించింది. వీఐపీలు లేకుండా ఈ సైరన్‌లను వినియోగిస్తే చట్టరీత్యా నేరమని కూడా ప్రకటించింది. అయినప్పటికీ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న బాబి, అతని అనుచరులు ఈ నిబంధనలు పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. కనీసం కార్పొరేటర్ కూడా కానీ వ్యక్తికి సంబంధించిన ప్రైవేటు కార్యక్రమంలో సైరన్‌లతో ఇన్ని కార్లు వినియోగించడం నిబంధనలు ఉల్లంఘించడమే. అయినప్పటికీ ఏ ఒక్క అధికారి అభ్యంతరం తెలపకపోవడం గమనార్హం. రాజ్యాంగ బద్ధంగా విధులు నిర్వర్తించాల్సిన అధికార యంత్రాంగం మొత్తం రాజ్యాంగేతర శక్తికి అనధికారికంగా వంత పాడడంపై జిల్లా కలెక్టర్‌తో సహా కీలక అధికారులు ఏమి చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే.

ఆలయాల్లో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



దుళ్ళలో శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



భక్తులు సమర్పించిన వస్తువులతో ధవళేశ్వరం వేంకటేశ్వరస్వామి

కడియం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా వైష్ణవాలయాల్లో మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆయా పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. మండల కేంద్రమైన కడియంలోని శ్రీ జనార్ధనస్వామి ఆలయం, కడియపులంకలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, దుళ్ళలోని శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం, రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామివారి ఆలయాలను భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకున్నారు.

వెంకన్నకు వెండి వస్తువుల సమర్పణ

ధవళేశ్వరం: ధవళేశ్వరంలో కొలువైయున్న వేంకటేశ్వరస్వామి వారికి తొలి ఏకాదశి సందర్భంగా పలువురు భక్తులు వెండి వస్తువులను సమర్పించారు. భక్తులు అయ్యల సత్యనారాయణ వెండి ఛత్రం, పాతుల బిందుమాధవి వెండి సాలగ్రామాల మాల, ఉల్లేటి సత్యవతి వెండి శంఖుచక్రాలు, చితిరాల ముత్యాలరావు వెండి నిత్యాభిషేక శంఖంలతో పాటు పలువురు భక్తులు ఇత్తడి వస్తువులను సమర్పించారు. తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు వివిధ రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.

స్వచ్ఛంద సేవకు చిరునామాగా నిలవాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత సేవా సంస్థ నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో మానవత్వంతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవత సేవా సంస్థ స్వచ్ఛంద సేవకు చిరునామాగా మారి నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో వైఎమ్‌వీఏ ఫంక్షన్ హాల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా బూరగడ్డ మురళి, కార్యదర్శి సుగ్గు విశ్వనాథం, వైస్ ప్రెసిడెంట్‌గా మెహర్ మధు, జాయింట్ సెక్రటరీగా అగ్నిహోత్రం శ్రీనివాసన్, కోశాధికారిగా సబ్బిసెట్టి రాంబాబు, ఇ సి హెల్త్ డాక్టర్. కొమ్మా శ్రీనివాసరావు, ఎసి అవేర్నెస్ యు శ్రీరామ్‌మూర్తి, ఈసీగా ఎడ్యుకేషన్ అప్పారావు ఎంపికయ్యారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు మురళీ మాట్లాడుతూ సంస్థ ప్రధానంగా మరణానంతర సేవలను ఉచితంగా అందిస్తున్నదన్నారు. ఫ్రీజర్ బాక్సులను, శాంతి థలను, జబ్బుపడినవారికి ఉచిత అంబులెన్సు సర్వీసులను, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల వికాసం, టాలెంట్ గుర్తింపు, వ్యక్తిత్వ వికాసం, పేద విద్యార్థులను, నిరుపేద కుటుంబాలను ఆదుకోవటం, మొదలగు కార్యక్రమాలను మానవత సంస్థ చేస్తున్న సేవలను వివరించారు. మానవతా తరుపున పేద విద్యార్థినికి 10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత రీజన ల్ చైర్మన్ చింతా ప్రసాద రెడ్డి, సహ చైర్మన్ మద్దుల మురళీకృష్ణ, కన్వీనర్ కే వి వి గాంధీసత్యరాయణ (గాంధీ మాస్టర్), జిల్లా కేంద్ర సమన్వయ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు జానకిరామరాజు, దంగేటి భాస్కరరావు పాల్గొన్నారు.

ఏపీపీ మిల్ రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీకే



నూతన కార్యవర్గ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: ఏపీ పేపరు మిల్లు రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు డాక్టర్ టికే విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని శ్రీ కృష్ణ సాయి కల్యాణ మండపంలో అసోషియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025–27 సంవత్సరానికి నూతన కమిటీ నియామకం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఏపీ పేపర్ మిల్లులో ఆఫీసర్స్‌గా చేసి రిటైర్ అయిన తర్వాత సభ్యులు వేరే ప్రాంతాల్లో వారి కుటుంబ సభ్యులతో సెటిల్ అయినా సరే కనీసం ఇలా సంవత్సరానికి ఒకసారైనా జనరల్ బాడీ మీటింగ్‌లో పాల్గొని సభ్యులందరూ కలిసి ఒకరి కుటుంబ విశేషాలు ఒకరు తెలుసుకోవడం, సభ్యుల మనసుకి ఆహ్లాదాన్ని ఇస్తుందన్నారు. ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో వనభోజనాలు, సంక్రాంతికి పండగకు సంక్రాంతి సంబరాలు నగరంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చనిపోయిన 11 మంది అసోసియేషన్ సభ్యులకు ఘనంగా నివాళులు అర్పించారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా సి.హెచ్.వి. రామరాజు, సెక్రటరీగా ఎస్.వి.వి.రెడ్డి, ట్రెజరర్‌గా బి.అప్పారావు, ఉపాధ్యక్షులుగా పి.బి.ఎస్. భాస్కరశర్మ, ఎం.భాస్కరరావు, జాయింట్ సెక్రటరీలుగా ఎం.ఆర్.ఎల్.శర్మ, సీహెచ్.ఎస్. వీరభద్రరావు, ఏ. శివప్రసాద్ ఎన్నికయ్యారు.

వైద్య నిపుణుల అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ గూడూరి



అంతర్జాతీయ వైద్య సదస్సులో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: అమెరికన్ కాలేజ్ ఆఫ్ చెస్ట్ ఫిజీషియన్స్ (ఏసీసీపీ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వైద్య నిపుణుల అంతర్జాతీయ సదస్సులో రాజమహేంద్రవరం నగరానికి చెందిన ప్రఖ్యాత వైద్య నిపుణులు, విజయ భారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ గూడూరి శ్రీనివాస్ చైర్ పర్సన్‌గా హాజరై అంతర్జాతీయంగా సమకాలీన అత్యాధునిక వైద్య ప్రత్యేక అంశంపై ప్రసంగించారు. శని, ఆదివారాల్లో అంతర్జాతీయ స్థాయిలో అమెరికన్ కాలేజ్ ఆఫ్ చెస్ట్ ఫిజీషియన్స్ (ఎసిసిపి) ఆధ్వర్యంలో సన్ రైజ్ సంస్థ బెంగళూరులో రెస్పిరేటరీ ఇన్నోవేటివ్ ఇన్ సైంటిఫిక్ ఎడ్యుకేషన్ లైవ్ లర్నింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. వైద్యనిపుణులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఈ అంతర్జాతీయ సదస్సులో ఆస్తమా, సిఒపిడి, ఐఎల్డి రేడియాలజీ పై ప్రత్యేక అంశంపై ప్రసంగించి లైవ్ లెర్నింగ్ ఇచ్చారు. దేశ విదేశాల నుంచి వైద్యనిపుణులు హాజరయ్యారు.

సార్వత్రిక సమ్మెకు పీడీఎస్‌యూ మద్దతు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కార్మిక చట్టాలను హరించే విధంగా తెస్తున్న లేబర్ చట్టాలను రద్దు చేయాలని వివిధ డిమాండ్లతో దేశవ్యాప్తంగా చేస్తున్న సార్వత్రిక సమ్మెకు పీడీఎస్‌యూ మద్దతు ఇస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఎండీ రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ ఆదివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పని గంటల విధానాన్ని పెంచి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా తెస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేదిశగా కేంద్రం అడుగులు వేస్తూ కారు చౌకగా అంబానీ, అదానీలు అయిన కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతోందన్నారు. విశాఖ ఉక్కును సైతం ప్రైవేటీకరణ చేస్తూ వేల కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేసే ప్రయత్నం జరుగుతున్నదని, దీనికి ఉదాహరణనే విశాఖ ఉక్కు సొంత గనులు కేటాయించకపోవడం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి ఏమాత్రం తీసిపోకుండా పనిగంటల విధానాన్ని ముందుగా పెంచడం నిదర్శనమన్నారు. కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయకుండా ఊడిగం చేస్తోందన్నారు. విభజన హామీలు అమలు చేయించడంలో విఫలం అయిందన్నారు.

రజకులను ఎస్సీల్లో చేర్చేందుకు కృషి

రాజమహేంద్రవరం సిటీ: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర మంత్రితో రజక ప్రతినిధుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ హామీ ఇచ్చారు. ఆవారం రాజమహేంద్రవరం శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జరిగిన 'రజక ఆకాంక్ష సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ రజకుల సమస్యలపై పార్లమెంటు చర్చించేలా చూస్తానన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రజకుల సమస్యలకు పరిష్కారం పొందేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి, ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ప్రకాశం నగర్ : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక ధృడత్వం చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ స్టేడియంలో సీజన్ 17 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి టీకే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన ఎస్‌వై లెవెన్ జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహకులు రాఫీ, కోటా, ఉమాను అభినందించారు. పది జట్లతో 12 రోజుల పాటు సాగిన ఈ టోర్నమెంట్ యువతను ప్రోత్సహించే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు వజ్రనాథ్, 42వ డివిజన్ ఇన్‌చార్జి నామాన వాసు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి

ప్రకాశం నగర్ : పేపర్ మిల్లు యాజమాన్యం నిరంకుశ వైఖరిని వీడి, తక్షణమే పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో అరుణ్ మాట్లాడుతూ పేపర్‌మిల్లు కార్మికుల సమ్మె పోరాటానికి సీఐటీయూ జిల్లా కమిటీ పూర్తి మద్దతను తెలియజేస్తోందన్నారు. 2024 ఏప్రిల్ మాసంలో మిల్లు యాజమాన్యం కలెక్టర్ సమక్షంలో వేతన ఒప్పందం అమలు చేస్తామని రాత పూర్వక హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. మళ్లీ 2025 జనవరిలో కార్మికుల సమ్మె చేయగా మరోసారి వేతన ఒప్పందం చేస్తామని హామీ ఇచ్చినప్పటికి ఇప్పటికీ ఆ హామీని నిలబెట్టుకోలేదన్నారు. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ జూలై 5 నుంచి కార్మికులు నిరవధిక ఆందోళన చేస్తున్నారని, తక్షణమే ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర



ప్రత్యేక అలంకరణలో మరిడి మహాలక్ష్మి అమ్మవారు



శక్తివేషధారణలో నృత్యాలు



గరగనృత్యాలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామదేవత శ్రీమరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు. జాతరలో శక్తివేషాలు, గరగాట–కోలాటం, కోయడ్యాన్సు, విచిత్ర వేషధారణలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. భక్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విశ్వశాంతి కోసం దైవ నామస్మరణ



నల్లమిల్లిలో మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రంగంపేట: విశ్వశాంతి కోసం ప్రతి ఇంటా సామూహిక దైవనామస్మరణ చేయడం అలవాటు చేసుకోవాలని, అందుకోసమే ఏకాహ, సప్తాహ భజనలు చేస్తున్నామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నల్లమిల్లి గ్రామంలో కోదండ రామాలయంలో సప్తాహ భజన కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి సంస్థలు లేని గ్రామాలలో 108 భజన పాటల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, భక్తులు అనూహ్య రీతిలో పాల్గొని సామూహిక భజన చేయడం అభినందనీయమన్నారు. సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథ యాత్రను విజయవంతం చేసిన ఈ గ్రామస్తులు వెంటనే సప్తాహ భజనలో సాయి సంస్థలకు 8 గంటల పాటు భజన చేసే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ఏడు రోజులు సప్తాహ భజనలు విజయవంతం కావాలని దీనికి సత్యసాయి, శ్రీరాముని దివ్య ఆశీస్సులు ఉంటాయని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు భజనల నిర్వాహకులు మామిడాల సూరిబాబు, నళిని దంపతులు కలశ స్థాపన, అఖండ దీపారాధన, సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి సప్తాహ భజనలు ప్రారంభించారు. స్థానిక భజన మండలితో పాటు రాజమహేంద్రవరం, నిడదవోలు భజన బృందాలు సుమారు ఎనిమిది గంటల పాటు చేసిన సత్యసాయి శత అష్టోత్తర భజన పాటలు కార్యక్రమం భక్తుల్ని పారవసుల్ని చేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త ఎన్‌వీ సాయిరాం, విద్యా విభాగ సమన్వయకర్తలు శ్రీనివాసరాజు, రత్నశ్రీ, భజన విభాగ సమన్వయకర్త వి.సుభాష్, జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, సేవా సమితి కన్వీనర్లు వీర్రాజు, వెంకట అమర్నాథ్, గోవిందరాజులు, వేదాధ్యాయన సమన్వయకర్త గాయత్రి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఆదివారం రాజమహేంద్రవరం డిపోలో డీపీటీఓ వైఎస్ఎన్ మూర్తితో కలసి మెయిన్ బస్‌స్టేషన్, పల్లె వెలుగు బస్‌స్టేషన్, కార్గో కౌంటర్లను పరిశీలించారు. అధికారులు, ఆఫీస్ సిబ్బంది, ట్రాఫిక్, గ్యారేజీ సిబ్బందితో మీటింగ్ ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు కష్టపడి పనిచేస్తున్నారని వారి ఆరోగ్యాలపై శ్రద్ధ చూపాలన్నారు. మహిళలకు త్వరలో ప్రవేశ పెట్టబోతున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయడానికి బస్సు కండిషన్‌ను మెరుగుపరచాలన్నారు. జీరో యాక్సిడెంట్స్, జీరో బ్రేక్ డౌన్స్ ధ్యేయంగా పని చేయాలని, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని, ఉద్యోగులందరూ ఆ దిశగా పనిచేయాలని అన్నారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలకు ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా స్థాయి అండర్ 13 పోటీలలో బాలుర విభాగంలో శ్రీ నికేష్ జమ్మలమడక ప్రథమ బహుమతి, సత్య తేజ శ్రీ సుంకర బాలికల విభాగంలో ద్వితీయ బహుమతి గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని కోచ్ విత్తనాల కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలో హార్డ్‌వేర్ పెయింటర్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో ఈ పోటీలు నిర్వహించారు. అండర్–11లో సుజయ్ వై మొదటి బహుమతి, అండర్–7 కేతన్ సాయి క్రియ మొదటి బహుమతి, లక్ష్మీ చైతన్య ద్వితీయ బహుమతి, బాలికల విభాగంలో పరిణీత మొదటి బహుమతి, అండర్ 9 బాలికల విభాగంలో హంసిక ద్వితీయ బహుమతి గెలుపొందారని తెలిపారు.

ఉపాధ్యాయులకు తీవ్ర ఒత్తిడి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బోధనేతర పనులు, అనవసర ఒత్తిడితో ఉపాధ్యాయులు తీవ్రంగా సతమతమవుతున్నారని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జేడీఐజే డేనియల్ బాబు తెలిపారు. స్థానిక డీఎమ్‌హెచ్ స్కూలులో ఎస్‌టీయూ జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోకల్ హాలిడే, ఆప్షన్ హాలిడే విషయంలోను కమిషనర్ స్థాయి అధికారి జోక్యం చేసుకోవడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని, సమస్య చిన్నదా, పెద్దదా అని కాకుండా జిల్లా నాయకత్వానికి చేరవేయాలన్నారు. ఉపాధ్యాయులపై పడుతున్న బోధనేతర పనిభారం తగ్గించేందుకు త్వరలో కార్యాచరణ చేపడతామన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఎస్‌టీయూ అభయ్ స్కీమ్ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఆడిట్ కమిటీ అధ్యక్షుడు త్రినాథబాబు, మండలాల నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్ 20న గోదావరి టాలెంట్ టెస్ట్

ప్రకాశం నగర్ : ప్రతిష్టాత్మకంగా సాగే గోదావరి టాలెంట్ టెస్ట్ డిసెంబర్ 20న మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్లు టాలెంట్ టెస్ట్ కన్వీనర్ ఎస్‌పీ గంగిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నుంచి పదవ తరగతిలోపు విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి మల్టీపుల్ చాయిస్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు అన్ని మండల కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 60 శాతం పైబడి మార్కులు సాధించిన వారికి మెరిట్ సర్టిఫికెట్ ఇస్తామని, అన్ని తరగతుల నుంచి ఫస్ట్ సాధించిన విద్యార్థికి మూడు వేల నగదు గోల్డ్ మెడల్, రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థికి రెండు వేల నగదు సిల్వర్ మెడల్, మూడవ స్థానానికి వెయ్యి రూపాయల నగదు బ్రాంజ్ మెడల్‌ను బహుమతిగా ఇస్తున్నట్లు చెప్పారు. జూలై 31 వ తేదీ లోపు ఎడ్యుకేషన్ స్పెషల్ బిల్డింగ్ గణేష్‌చౌక్ చిరునామాలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9440127988 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.